# త్వరలో 463 గణాంకాధికారుల

# పోస్టుల భర్తీ

## రెవెన్యూ డివిజన్, జిల్లాస్థాయిలో పలు పోస్టులు ఖాళీ

## భర్తీకి కసరత్తు ప్రారంభించిన ఆర్థికశాఖ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో వివిధ శాఖల్లో ఉన్న ఖాళీ పోస్టులను వరుసగా భర్తీచేసుకుంటూ వస్తున్న ప్రభుత్వం గణాంక శాఖాధికారుల నియామకానికి కసరత్తు ప్రారంభించింది. మండలం, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో గణాంక శాఖాధికారుల పోస్టుల భర్తీకి రాష్ట్ర ఆర్థికశాఖ సన్నాహాలు మొదలుపెట్టింది. రాష్ట్రంలో 584 మండలాలు ఉండగా, ఇందులో 463 మండల గణాంకాధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటితో పాటు రెవెన్యూ డివిజన్, జిల్లాస్థాయిల్లో ఉన్న పోస్టులను కూడా భర్తీ చేయనున్నట్టు తెలిసింది. కొత్తగా ఏర్పాటైన రెవెన్యూ డివిజన్లతోపాటు 21 జిల్లాల్లో గణాంకాధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని రాష్ట్ర ఆర్థికశాఖ నిర్ధారించింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పోస్టుల సంఖ్యను, గణాంకాధికారుల బాధ్యతలను, భవిష్యత్తులో నిర్వర్తించాల్సిన పనులను ఆర్థికశాఖ నిర్వచించనున్నది. ఆర్థికశాఖ సర్వేలు మూసధోరణిలో ఉండకూడదని, శాస్త్రీయ పద్ధతిని అవలంబించాలని రాష్ట్ర ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ గణాంకశాఖ అధికారులకు ఇటీవల సూచించారు. ఈ నేపథ్యంలోనే మండలం, జిల్లాస్థాయిల్లో చాలాఖాళీలు ఉండటం వల్ల అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పోస్టులను భర్తీచేస్తే రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ఫలితాలను గణాంకశాఖ సాధించగలుగుతుందని టీఎస్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మామిండ్ల రాజేందర్ ప్రభుత్వ పెద్దలకు నివేదించారు. రెవెన్యూ డివిజన్ స్థాయిలోని ఉపగణాంకాధికారి పోస్టులను గెజిటెడ్ హోదాకు పెంచే కృషి జరుగుతున్నది. ఇదేహోదా, ఇదే వేతనంతో పనిచేస్తున్న సబ్‌రిజిస్ట్రార్, కోఆపరేటివ్ సబ్‌రిజిస్ట్రార్, హెడ్‌మాస్టర్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ వంటి అధికారులకు గెజిటెడ్ హోదా ఇచ్చారని, ఈ వరుసలోనే తమ న్యాయమైన విజ్ఞప్తిని పరిశీలించాలని కోరుతూ ప్రభుత్వానికి నివేదించామని తెలంగాణ ఎకనామిక్ స్టాటిస్టికల్ సబ్‌ఆర్డినేట్ అసోసియేషన్ (టెస్సా) అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి అంజయ్య తెలిపారు.

**ఇవీ.. గణాంకశాఖ అధికారుల విధులు**

రాష్ట్ర స్థూల ఆదాయాన్ని లెక్కించడం, పంటలను శాస్త్రీయంగా అంచనావేస్తూ నివేదికలు రూపొందించడం, పంటల బీమా పథకం వినియోగం, వర్షపాతం నమోదు, వ్యవసాయ దిగుబడులు, పారిశ్రామిక ప్రగతి, రాష్ట్రానికి లభిస్తున్న రెవెన్యూ వనరులు, పంటల దిగుబడికి నిత్యావసర సరుకుల ధరలను అనుసంధానంచేస్తూ రూపొందించే పట్టికలు, సూచీలు వంటి అనేక లెక్కలను గణాంకశాఖ అధికారులు నిర్ధారిస్తారు. వివిధశాఖలపై వీరు రూపొందించిన గణాంకాలు రాష్ట్ర బడ్జెట్ రూపకల్పనకు ఉపయోగపడుతున్నాయి. గ్రామ పంచాయతీ నుంచి రాష్ట్ర సచివాలయం వరకు కావాల్సిన గణాంక నివేదికలను వీరు తయారు చేస్తున్నారు. ఉమ్మడిరాష్ట్రంలో ఈ శాఖ రూపొందించిన గణాంకాలు తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి దోహదపడ్డాయి. ఈ కారణాలతో మండలం, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లోని పోస్టులను భర్తీచేయాలని, కావాల్సిన శిక్షణ కూడా సిబ్బందికి ఇవ్వాలని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నట్టు తెలిసింది.